

బందరు పోర్టుకు ఇక మిగిలింది శిలాఫలకమే..



పేరుకు రాజధాని జిల్లా.. పైసా విదిల్చింది లేదు.. కనీస చెల్లింపులు లేవు.. రాజధాని జిల్లాలపై ఆది నుంచి సవతి ప్రేమ చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చిట్ట చివరి బడ్జెట్‌లోనూ అదే పంథా కొనసాగించింది. కీలకమైన అంశాల ప్రస్తావనే లేకుండా, అమరావతి అభివృద్ధి అంశమే రాకుండా ఈ బడ్జెట్ సమావేశాన్ని ముగించింది.

చిట్టా చివరన..

విదిల్చిందేం లేదు




- రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రెండు జిల్లాలకు రిక్తహస్తం
- కీలకమైన బందరు పోర్టు ప్రస్తావనే లేదు
- గన్నవరం విమానాశ్రయ నిర్వాసితుల ఊసే మరిచారు
- ఇక అమరావతి సంగతి సరేసరి..!

(మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని ప్రధాన అంశాల ప్రస్తావన లేకుండానే ముగించారు. ఎన్నికల్లో లబ్ధి కోసం హడావుడిగా మొదలుపెట్టిన బందరు పోర్టు ప్రస్తావన కానీ, కొన్నేళ్లుగా నలుగుతున్న గన్నవరం విమానాశ్రయ నిర్వాసితులకు పునరావాసాన్ని కల్పించే విషయంలో కానీ ఎలాంటి ఊసూ లేదు. ఓట్ ఆన్ బడ్జెట్ కావడంతో కేవలం సంక్షేమానికి సంబంధించిన కేటాయింపులపై మాత్రమే దృష్టిపెట్టి మిగిలిన అంశాలను ఎన్నికల అనంతరం వచ్చే ప్రభుత్వమే చూసుకుంటుందన్న తరహాలో ముగించేశారు.

- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బందరు పోర్టు పనులను హడావుడిగా ప్రారంభించారు. అయితే, గత బడ్జెట్‌లో కానీ, తాజా బడ్జెట్‌లో కానీ పైసా విదిల్చింది లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన 2020-21 బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. 2021-22, 2022-23 బడ్జెట్‌లో రూ.150 కోట్లు చొప్పున కేటాయించారు. కానీ, అందులో పైసా నిధులు ఖర్చు పెట్టలేదు. 2023-24 బడ్జెట్‌లో మళ్లీ రూ.150 కోట్లు కేటాయించారు. ఈ మొత్తం భూసేకరణకే సరిపోలేదు. ఈ నిధులతోనే ప్రస్తుతం పోర్టు పనులను చేస్తున్నారు.
- విజయవాడ విమానాశ్రయ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించే విషయంలో ప్రభుత్వం అత్తెసరు కేటాయింపులు జరిపింది. 2022-23 బడ్జెట్‌లో కేవలం రూ.22.76 కోట్లను మాత్రమే కేటాయించింది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అపహాస్యం పాలుచేసేలా ఈ కేటాయింపులు ఉన్నాయని అప్పట్లో టీడీపీ సహా అన్ని రాజకీయపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈసారి ఓటాన్ కావడంతో దీని ప్రస్తావన కూడా బడ్జెట్‌లో చేయలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో అమరావతికి అసలెప్పుడూ పైసా విదిల్చింది లేదు.

ఆఖరి బడ్జెట్ కూడా బోగస్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆఖరి బడ్జెట్ కూడా బోగస్. అభివృద్ధి పనులకు మోక్షం కలగలేదు. కొత్త పనుల మంజూరు దేవుడెరుగు. పాత అభివృద్ధి పనులైన పూర్తి చేయలేని దుస్థితి. బటన్ నొక్కి, ఇచ్చేది అరకొర. వందలో 25 మందికి కూడా పథకాలు అందని పరిస్థితి. లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకొచ్చిన అప్పులు చూపించలేదు.

\- బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే

వ్యాపారులకు భారమే..




వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ వ్యాపారులకు భారంగా ఉంది. కేవలం ఎన్నికల కోసమే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీనివల్ల వ్యాపారులకు నష్టమే కానీ, లాభమేమీ లేదు.

\- కొణిజేటి రమేశ్, ఏపీ ట్రేడర్స్ జేఏసీ అధ్యక్షుడు



● చిత్రం భళారే..!

చిత్రకారుడు కాన్వాస్‌పై గీసిన మనోహరమైన ప్రకృతి సోయగంలా ఉంది కదూ ఈ చిత్రం. అప్పుడే వీడుతున్న మంచుతెరల మాటు నుంచి బయటకు వస్తున్న చెట్ల కొమ్మలు.. చలి పంజా నుంచి తప్పించుకుని మిణుకు మిణుకుమంటూ బయటపడిన వాహనం చూడచక్కగా ప్రకృతి రమణీయతను కళ్లకు కట్టాయి. అవనిగడ్డలో బుధవారం ఉదయం 9 గంటలకు కనిపించిన చిత్రమిది. - అవనిగడ్డ రూరల్



కాసుల కోసం కక్కుర్తిపడితే చాలు.. రోడ్లపై చల్లే బ్లీచింగ్ ఏమిటీ? నీటిలో పురుగులను చంపే ఆలం, పనికిరాని వాల్వ్‌లు, ఉపయోగపడని విద్యుత్ మోటార్లు, రాగివైర్లు.. అబ్బో అన్నింటినీ అయినకాడికి అమ్మేసుకుని సొమ్ము చేసుకోవచ్చు. ప్రస్తుతం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్నదిదే. కీలక ప్రజాప్రతినిధి సొంత మనిషైన ఓ క్యాంప్ క్లర్క్, (సీసీ) ప్రతి పనికీ ఓ రేటు కట్టి సామాన్యుల వద్ద దోచేస్తుంటే, సదరు సీసీని ప్రసన్నం చేసుకున్న పబ్లిక్ హెల్త్ విభాగంలోని ఇద్దరు ఉద్యోగులు ఏకంగా బ్లీచింగ్, ఆలం, వాల్వ్‌లు, మోటార్లు, వైర్లు దొంగతనంగా అమ్ముకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు.

- కార్యాలయంలో సీసీ చెప్పిందే వేదం
- ప్రతి పనికీ ఓ రేటు కట్టి అక్రమ వసూళ్లు
- పబ్లిక్ హెల్త్ విభాగంలో మరో ఇద్దరి హవా
- బ్లీచింగ్, ఆలంను విక్రయిస్తున్నా ఎవరికీ పట్టదు
- కీలక పోస్టులన్నీ సొంత మనుషులకే..
- వైసీపీ కార్పొరేటర్లు, నాయకులను కూడా వదలరు

ఇంటిదొంగలు అండ్ కో..

దొరికింది దోచుకో..

మచిలీపట్నం కార్పొరేషన్‌లో అధికార పార్టీ అనుయాయుల లీలలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నానికి చెందిన కీలక ప్రజాప్రతినిధి మునిసిపల్ కార్పొరేషన్‌లో తన సొంత సామాజికవర్గానికి చెందిన ఉద్యోగిని క్యాంప్ క్లర్క్ (సీసీ)గా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు కార్యాలయంలో అతని మాటే శాసనం. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులే కాదు.. ప్రముఖులు, ప్రజలు వివిధ పనులపై కార్యాలయానికి వెళ్తే, ముందుగా ఈ సీసీని దర్శించుకోవాల్సిందే. అక్కడి నుంచి అసలు కథ మొదలవుతుంది. ఈ ఉద్యోగి తన నోటితో ఏదీ చెప్పడు. పని పూర్తి కావాలంటే ఇంతమేర నగదు ముట్టజెప్పాలని అక్కడున్న సిబ్బందితో చెప్పిస్తాడు. పదేపదే తిరిగి విసిగిపోయిన వారు చేసేదిలేక నగదు ఇచ్చి పనులు చేయించుకుంటారు. సీసీ వసూళ్లపర్వం అధికమైందని, ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి తమ వద్దే నగదు అడుగుతున్నాడని, కట్టడి చేయాలని ప్రజాప్రతినిధికి కార్పొరేటర్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇటీవల వీరి లీలలు అధికం కావడంతో ప్రజాప్రతినిధి, సీసీ వ్యవహారశైలిపై స్థానిక శాసనసభ్యుడికి కొందరు కార్పొరేటర్లు నేరుగా ఫిర్యాదు చేశారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు.



పబ్లిక్ హెల్త్ విభాగంలో ఆ ఇద్దరిదే హవా

కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ విభాగంలో ఇద్దరు ఉద్యోగులు తమ చిత్తానుసారం వ్యవహరిస్తున్నారు. గుడివాడ నుంచి వచ్చే ఈ ఇద్దరు ఉద్యోగులు తమ విధులను పక్కనపెట్టి కొంతకాలంగా బ్లీచింగ్‌ను గుట్టుచప్పుడు కాకుండా బయట విక్రయించేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రెండు లక్షల మందికిపైగా సరఫరా చేసే తాగునీటి క్లోరినేషన్ సంగతేమో గానీ పబ్లిక్ హెల్త్ విభాగం గోడౌన్‌లో ఉండాల్సిన బ్లీచింగ్ మాత్రం సంచులకొద్దీ మాయమవుతోందని అధికారపక్ష కార్పొరేటర్లే చెప్పుకోవడం గమనించదగ్గ అంశం. పంప్‌హౌస్ వద్ద నీటిని శుద్ధి చేసేందుకు, పురుగులు చనిపోయేందుకు ఆలంను వాడతారు. ఈ ఆలంను సైతం ఈ ఇద్దరు ఉద్యోగులు బయటి వ్యక్తులకు విక్రయించేస్తున్నా పట్టించుకునే వారే లేరు. కీలక ప్రజాప్రతినిధికి, సదరు సీసీకి సఖ్యతగా ఉంటూ ఈ ఇద్దరు ఉద్యోగులు తమదైన శైలిలో బ్లీచింగ్, ఆలంను విక్రయించేస్తున్నారు. వాటర్‌వర్క్స్ విభాగంలోని పనికిరాని వస్తువుల పేరుతో విలువైన వాల్వ్‌లు, విద్యుత్ మోటార్లు, రాగివైరు ఒక లారీకి సరిపడా సామాన్లను పాత ఇనుము ధరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదులు అందినా బుట్టదాఖలే అయ్యాయి. అధికారులు పబ్లిక్ హెల్త్ విభాగంపై దృష్టిసారించి, పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు నిజాలు బయటపడతాయని కార్పొరేటర్లతో పాటు ఈ విభాగంలో పనిచేసే ఉద్యోగులు అంటున్నారు.

కీలక పోస్టుల్లో అయినవారు..

ఈ కార్పొరేషన్ కార్యాలయంలో ఇటీవల ఉద్యోగులకు సంబంధించిన సీట్ల మార్పిడి చేశారు. బదిలీపై వెళ్లిన కమిషనర్ ద్వారా ఉద్యోగుల సీట్లను మార్పుచేసిన సమయంలో కీలక ప్రజాప్రతినిధి వర్గీయులకు ఆదాయం సమకూరే సీట్లు కేటాయించి, ఇతరులకు నామమాత్రపు సీట్లు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజయవాడకు చెందిన ప్రభావతి... ఓ ప్రముఖ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసుకున్న పొదుపును బ్యాంకు అకౌంట్లో ఉంచుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఆమెకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ముంబయి నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. కరెంట్ బిల్లు ఇప్పటి వరకు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని గట్టిగా మాట్లాడాడు. ఇదంతా ఆమె నిజమే అనుకున్నారు. ఒక లింక్‌ను పంపుతానని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్పాలని చెప్పాడు. ఆమె లింక్‌పై క్లిక్ చేయగానే ఒక యాప్ డౌన్‌లోడ్ అయింది. అతడు చెప్పినట్టుగానే ఓటీపీ వివరాలు ప్రభావతి ఇచ్చేశారు. అంతటితో తన పని అయిపోయిందనుకున్నారు. తర్వాత కొన్నిరోజులకు దఫదఫాలుగా ఆమె అకౌంట్ నుంచి రూ.7 లక్షలు మాయమయ్యాయి. దీంతో ఆమె లబోదిబోమంటూ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల జరిగిన ఘటన ఇది.



ఈ ఒక్క ఘటనే కాదు.. ఇటీవల కాలంలో ఇలాంటి మోసాలు చాలానే వెలుగులోకి వస్తున్నాయి. టీం వ్యూవర్, ఫాస్ట్ షేర్ ట్రాన్స్‌ఫర్, షేర్‌మీ, ఫైల్ షేరింగ్, ఈజీ షేర్ వంటి యాప్‌లను ఆసరాగా చేసుకుని ఈ సైబర్ నేరాలు జరుగుతున్నాయి.

దొంగ లింకులు

లింక్ పంపి నగదు దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు

- మొబైల్ మనదే.. ఆపరేషన్ మాత్రం దొంగల చేతిలో..
- వివిధ యాప్‌ల ద్వారా నయా దోపిడీ
- విజయవాడలో పెరుగుతున్న కేసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : టీం వ్యూవర్, ఫాస్ట్ షేర్ ట్రాన్స్‌ఫర్, షేర్‌మీ, ఫైల్ షేరింగ్, ఈజీ షేర్.. ఇవన్నీ నెట్‌వర్క్‌కు సంబంధించిన యాప్స్. ఒక కంప్యూటర్ నుంచి మరో కంప్యూటర్‌లో ఉన్న ఫైళ్లను తీసుకోవడానికి ఉపయోగించే నెట్‌వర్క్. సాంకేతికంగా పనిని సులభతరం చేసుకోవడానికి అందుబాటులోకి వచ్చిన ఈ యాప్‌లను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ప్లేస్టోర్‌లోకి నేరాలకు సులభంగా ఉపయోగపడే యాప్‌లను వదులుతున్నారు. వాటికి లింక్‌లను రూపొందించి ఆండ్రాయిడ్ వినియోగదారులకు పంపుతున్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత ఫోన్ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. దఫదఫాలుగా బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదును మాయం చేస్తున్నారు.

బిల్లులు చెల్లించాలని ఫోన్లు చేసి..

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, యూపీఐ యాప్‌లు అందుబాటులోకి వచ్చాక బిల్లుల చెల్లింపు సులభంగా మారింది. విద్యుత్ బిల్లు, ఇంటి అద్దె, ఎల్ఐసీ ప్రీమియం, వాహనాల బీమా వంటి వాటిని ఈ యాప్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత సైబర్ నేరగాళ్ల పంథా కొత్త పరుగులు తీస్తోంది. వినియోగదారులు వేసే అడుగులకు అనుగుణంగా నేరాల తీరును తిప్పుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి విద్యుత్ బిల్లు చెల్లించాలని, క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లించాలని వినియోగదారులకు ఫోన్లు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్‌కాల్స్‌పై అవగాహన ఉన్న వారు మాత్రం వాటిని వెంటనే కట్ చేస్తున్నారు. అవగాహన లేనివారు మాత్రం ఈ నేరగాళ్ల వలలో చిక్కుకుపోతున్నారు. ఫోన్లు చేశాక అధికారుల మాదిరిగా మాట్లాడుతున్నారు. నిజంగా బిల్లులు చెల్లించలేదన్న భావనలోకి వినియోగదారులు వెళ్లిపోతున్నారు. తాము ఒక లింక్ పంపుతామని దాన్ని ఓపెన్ చేసి, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్తే బిల్లు చెల్లింపు పూర్తవుతుందని చెబుతున్నారు. ఇలా టీం వ్యూవర్, ఓపెన్ లింక్ వంటి లింక్‌లను పంపుతున్నారు. వాటిని వినియోగదారులు ఓపెన్ చేయగానే, యాప్ డౌన్‌లోడ్ అవుతోంది. ఓటీపీని సైబర్ నేరగాళ్లకు చెప్పడంతో ఫోన్ వినియోగదారుల చేతుల్లో ఉన్నా ఆపరేషన్ మాత్రం నేరగాళ్లు చేస్తున్నారు. ఈవిధంగా ముంబయి నుంచి ఫోన్‌చేసిన సైబర్ నేరగాళ్లు ఓ బ్యాంకు మాజీ మేనేజర్ అకౌంట్లో నుంచి రూ.7 లక్షలను దఫదఫాలుగా లాక్కున్నారు.

హడావుడిగా..

ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- 279 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ప్రతిపాదనలేమీ వెళ్లకుండానే ఎస్‌జీటీ పోస్టులు
- ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వ మాయ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం బుధవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ హడావుడిగా నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులను మోసం చేయడానికే అనే విమర్శలు వస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదల చేసినా పోస్టుల భర్తీ ఇప్పట్లో జరిగే అవకాశం ఉండదని డీఈడీ, బీఈడీ చదివిన నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 103, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 111, టీజీటీ పోస్టులు 65 మొత్తంగా 279 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ప్రతిపాదనలు వెళ్లకుండానే..

ఉమ్మడి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు 730 మందికి పైగా మిగులుబాటుగా ఉన్నట్లు గతంలో లెక్కలు చూపారు. ఎస్‌జీటీ పోస్టుల భర్తీ చేయాల్సిన అవసరం లేదని నివేదికను ప్రభుత్వానికి పంపారు. కానీ, బుధవారం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్‌జీటీ పోస్టులు 103 భర్తీ చేస్తామని ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 4న జరిగిన సమావేశ ప్రతిపాదనల ప్రకారం 107 పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తాజా నోటిఫికేషన్‌లో ఈ సంఖ్యను 111గా చూపారు. వీటితో పాటు ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) పోస్టులను మరో 65 అదనంగా చూపారు. ఈ పోస్టులు అసలు జిల్లాలో ఖాళీగా ఉన్నాయా, లేదా అనే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం జిల్లాలోని సుమారు 70వేల మంది డీఈడీ, బీఈడీ అభ్యర్థులను మాయ చేయడమేననే వాదన వినిపిస్తోంది. ఎస్‌జీటీ పోస్టులకు డీఎడ్ చదివినవారు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు బీఈడీ చదివినవారే పరీక్ష రాయాలనే నిబంధన పెట్టారని అంటున్నారు.

ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్

ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలి

కొత్త బస్సుల కొనుగోలుకు అనుమతులు ఇవ్వండి

- ఉద్యోగులకు డీఏ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించండి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ వినతి

- 6లో



ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయని, అదేవిధంగా జనరల్, వొకేషనల్ గ్రూపులకు సంబంధించి థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 99 కేంద్రాల్లో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్టు తెలిపారు. 40082 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 35494 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. పరీక్షలకు హాజరుకానున్నట్టు వివరించారు. పరీక్షల నిర్వహణకు 99 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది కస్టోడియన్ అధికారులను నియమించడం జరిగిందని, 18 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. బందోబస్తు, భద్రతా చర్యలు, సీసీ కెమేరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు సంబంధించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని, హాల్‌టికెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చూడాలని సూచించారు. వేసవిని దృష్టిలో వుంచుకొని తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో వుంచుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, డాక్టర్ ఆర్.బాలాజీ నాయక్, ఏపీఎస్ ఆర్టీసీ ప్రతినిధి ఎంవై దానం, ఏఎస్పీవో ఎం.సత్యనారాయణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితాలో బదిలీలు

- 671 దరఖాస్తుల స్వీకరణ.. : కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : ఓటర్ల జాబితాలో బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఫారం-8 కింద ఇప్పటివరకు 6257 దరఖాస్తులు స్వీకరించగా, ఇందులో 5583 దరఖాస్తులు పేర్ల సవరణకు సంబంధించినవని, మిగిలిన 671 దరఖాస్తుల్లో 482 ప్రస్తుతం ఓటు వున్న నియోజకవర్గంలోనే అంతర్గత చిరునామా మార్పులకు సంబంధించినవని, మిగిలిన 180 ఇతర నియోజకవర్గాలకు బదిలీ కోరిన దరఖాస్తులు ఉన్నాయని, పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 45 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి బదిలీలకు అనుమతించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల నమోదు, జాబితాల సవరణలపై బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా బదిలీల్లో అవకతవకలు చోటుచేసుకొంటున్నాయని వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పార్టీల ప్రతినిధులకు వివరించారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలను పరిశీలించి వాటిలో వాస్తవాలను పరిశీలించి ఎలాంటి పొరపాట్లు దొర్లినా వాటిని సవరించేలా సంబంధిత అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో విశ్రీనివాసరావు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కేడీసీసీబీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

వ్యవసాయ, అనుబంధ రంగాలకు

విరివిగా రుణాలివ్వండి

- కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందజేసేందుకు బ్యాంకు అధికారులు ముందుకు రావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టర్ ఛాంబరులో జిల్లా కేంద్రసహకార బ్యాంకు, జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి, చెరకు, పత్తి, వేరుశెనగ, మత్స్యసంపద ఉత్పత్తులకు సంబంధించి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పాదకతను పెంచేందుకు పంటరుణాలు అందజేయాలన్నారు. ఎకరం భూమిలో వరి పండించడానికి రూ.42వేల ఖర్చు అవుతోందని అందుకు అనుగుణంగా వరిసాగుకు పంటరుణాన్ని ఎకరానికి రూ.50వేలకు పెంచాలని సూచించారు. వరితోపాటు చెరకు పంటకు రుణం మొత్తాన్ని పెంచేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కౌలు రైతులకు పంటరుణాలు అందించే విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. చేపల చెరువులకు రుణపరిమితిని పెంచేందుకు అవసరమైన నివేదికలను మత్స్యశాఖ అధికారులు తయారుచేసి బ్యాంకు అధికారులకు ఇవ్వాలన్నారు. సమావేశంలో కేడీసీసీబీ సీఈవో ఎ శ్యామ్‌మనోహర్, జీఎం బీఎల్ చంద్రశేఖర్, వ్యవసాయశాఖ జేడీ ఎన్ పద్మావతి, ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

విస్సన్నపేట, ఫిబ్రవరి 7: విస్సన్నపేట పట్టణం నూజివీడు రోడ్డులో రాణి సెల బ్రేషన్స్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీ కొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కొండపర్వకు చెందిన కోలా మల్లికార్జున్ (25), మానికల విజయ్‌బాబు (23)లు స్నేహితులు. వీరు పొలాలకు వేసే ఫెన్సింగ్ పనులకు వెళుతుంటారు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి మోటార్ బైక్‌పై విస్సన్నపేట నుంచి స్వగ్రామం కొండపర్వకు వెళుతుండగా గుడివాడ నుంచి చేపల లోడుతో ఢిల్లీ వెళుతున్న లారీ వారి బైక్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై జి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాల్ మృతుల కుటుంబాలను పరామర్శించారు.



ప్రమాదానికి కారణమైన లారీ

మృత్యువులోను వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన యువకులు మృతి చెందడంతో ఆకుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఎంతో స్నేహంగా మెలిగే వారిద్దరు అవివాహితులు మల్లికార్జునరావు తండ్రి చిరు వ్యాపారి కాగా విజయబాబు తండ్రి లారీ డ్రైవర్. రెండు కుటుంబాల్లోను మగ సంతానం ఒక్కరే కావడం, కుటుంబాలను ఆదుకుంటారనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో వారిని దూరం చేయడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

గన్నవరంలో ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

గన్నవరం: ఏలూరు వైపు నుంచి విజయవాడ ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. చిన అవుటపల్లి సమీపంలోని వేబ్రిడ్జి దగ్గర బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొనడంతో జాతీయ రహదారిపై పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దరిలో ఒకరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. మరొకరికి ఎడమ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. ఇద్దరు వెల్డింగ్ పని మీద వెళ్లి వస్తున్నట్టు వారి వద్ద వెల్డింగ్ మిషన్ రాడ్లు ఉన్నాయి. ప్రమాదానికి ట్రాక్టర్ డ్రైవర్ కారణమని చెబుతున్నారు. సంఘటన స్థలం వద్ద ట్రాక్టర్ లేదు. సంఘటన స్థలానికి ఆత్కూరు పోలీసులు వచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీసీల సత్తా చాటుదాం

- పెత్తందారి జగన్‌ను తరిమికొడదాం
- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 : బీసీలు ఏకతాటిపై నిలబడి అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలుపుదామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర పార్టీశ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మచిలీపట్నం బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, బీసీలు గళం ఎత్తితే తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌కు దడపుడుతోందన్నారు. దీంతో బీసీ నాయకులను అరెస్టులు చేస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. రాష్ట్రంలో 962 జయహో బీసీ సదస్సులు నిర్వహిద్దామనుకున్నామని, ఇప్పటికి 800 పూర్తయ్యాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాతే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా ఉంటారన్నారు. చంద్రబాబును ఏ జైలులో పెట్టించారో అదే జైలులోని బ్లాకులో జగన్‌రెడ్డికి చిప్పకూడు తినే యోగం పడుతుందన్నారు. మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని చంద్రబాబు తీసుకువస్తారన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని చంద్రబాబును ఇష్టారాజ్యంగా విమర్శిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో బీసీలు వేధింపులకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు గోకుల శివ, బీసీ సూర్యబలిజ రాష్ట్ర కన్వీనర్ చిత్తజల్లు నాగరాము తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న రవీంద్ర

భూ హక్కు చట్టం రద్దు చేయకపోతే

జగన్‌రెడ్డికి పుట్టగతులుండవు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7 : వైసీపీ ప్రభుత్వం అక్రమంగా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేసేంతవరకు న్యాయవాదులకు మద్దతుగా టీడీపీ తరపున ఉద్యమిస్తామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సమ్మెకు బుధవారం రవీంద్ర మద్దతు తెలిపారు. న్యాయవాదుల నిరసన ప్రదర్శనలో కొల్లు రవీంద్ర ప్లకార్డు పట్టుకుని సంఘీభావం తెలిపారు. నూతన చట్టం చీకటి చట్టమని, సివిల్‌కోర్టు పరిధిని తగ్గిస్తూ ప్రజల భూ యాజమాన్యాన్ని నిర్ణయించే హక్కు ప్రభుత్వంచే నియమించిన అధికారికి కట్టబెట్టడం అన్యాయమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే భూ హక్కు చట్టాన్ని రద్దుచేస్తామన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రాలపైనా సీఎం జగన్‌రెడ్డి ఫోటో వేసుకోవడం దురదృష్టకరమన్నారు. మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు మాట్లాడుతూ, 16వ తేదీ వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి కొట్టె రఘురాం, జీవీఎల్ నరసింహారావు, లంకె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలు మారే సంస్కృతి వసంతది

- నియోజకవర్గ టీడీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

మైలవరం, ఫిబ్రవరి 7: తరచూ పార్టీలు మారే సంస్కృతి వసంత కుటుంబానిదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జువ్వా రామకృష్ణ ఆరోపించారు. వసంత టీడీపీలోకి వస్తారనే విషయాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, అమరావతి రాజధాని వెళ్లిపోతే రాజీనామా చేస్తానన్న వ్యక్తి ఏం చేశాడని ప్రశ్నించారు. తాడేపల్లి, కొండపల్లి, జక్కంపూడి కొండలు మింగేశాడన్నందుకు 100 మంది వైసీపీ అల్లరి మూకలను తెచ్చి భయభ్రాంతులకు గురిచేసి టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టాడన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వజ్రాల కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వసంత టీడీపీ నేతలపై 3 నుంచి 10 వరకు కేసులు పెట్టించి ఏ కేసులు పెట్టించలేదని మొసలి కన్నీరు కారుస్తున్నాడన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఇంత వరకు పరిశీలన చేలేదన్నారు. టీడీపీలో ఆయన డబ్బుకు ఎవ్వరూ లొంగరన్నారు. అటువంటి వ్యక్తిని మా బుజాలపై ఎక్కి స్వారీ చేయిస్తామంటే ఎలా భరిస్తామన్నారు. సమావేశంలో ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), కోమటి సుధాకరరావు, వజ్రాల కుమార్ రెడ్డి, ఉయ్యూరు వెంకట నరసింహారావు, చుట్టుకుదురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

- బైక్‌పై వచ్చి ఆగంతకుడి దాడి
- పరిస్థితి విషమం, విజయవాడ తరలింపు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7: పట్టణంలో మిల్క్ పార్లల్ నిర్వహిస్తున్న వివాహితపై సీతారాంపురంలో బుధవారం రాత్రి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు హత్యాయత్నం చేయటం సంచలనం కలిగించింది.



చికిత్స పొందుతున్న గోపిరెడ్డి సత్యశ్రీ

శివాలయం వీధిలో ప్రైవేట్ కంపెనీ పాల బూత్ నిర్వహిస్తున్న గోపిరెడ్డి సత్యశ్రీ (35) రాత్రి గం 9.ల సమయంలో బూత్‌కు తాళం వేసి మోపెడ్‌పై ఇంటికి వెళ్తుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఆగంతకుడు ఆమెపై పదునైన ఆయుధంతో దాడి చేసి పరారయ్యాడు. ఆమె కేకలు విని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విజయ వాడకు 108లో పంపారు. తొలుత స్థానికులు ఆమె మెడలో గొలుసు దొంగతనంగా బావించారు. ప్రథమచికిత్స చేసిన ఆసుపత్రి వర్గాలు ఆమె మెడపై రెండు చోట్ల, పీక వద్ద 3 చోట్ల పదునైన ఆయుధంతో దాడి చేసినట్టు ఉందని చెప్పటంతో హత్యాయత్నంగా బావిస్తున్నారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆమె భర్త విజయవాడలో ఉంటున్నాడని, ఇక్కడ కుమార్తెతో కలిసి పాల వ్యాపారం చేస్తున్నట్టు స్థానికులు చెప్పా రు. సీసీ పుటేజి ద్వారా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాబు నివాసం వద్ద.. బిస్కెట్లు పంచిన కాగిత

- పెడన సీటు తనకేనని ఆనందం.. పలువురు ఇన్‌చార్జులతో టీడీపీ అధినేత భేటీ

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ బుధవారం ఇక్కడ తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నివాసం వద్ద బిస్కెట్లు పంచారు. అధినేత పిలుపుతో ఆయన పెద్ద సంఖ్యలో తన అనుచరులతో ఇక్కడకు తరలివచ్చారు. ఆ సీటును పొత్తులో భాగంగా జనసేన కోరుతోందనే ప్రచారంతో ఆయన అనుచర గణం ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక కాగిత ఆ సీటును జనసేనకు ఇవ్వడం లేదని, బాగా పనిచేసుకోవాలని తనకు చెప్పారని అనుచరులకు తెలియజేశారు. దీంతో వారంతా పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేశారు. వారిలో కొందరు దగ్గర్లో ఉన్న బడ్డీ కొట్టు వద్దకు వెళ్లి బిస్కెట్ ప్యాకెట్లు కొనుక్కొచ్చారు. ఆయన అక్కడ ఉన్నవారందరికీ పంచారు. ఈ పరిణామం తర్వాత మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిశారు. ఆయన పెడన సీటును ఆశిస్తున్నారు. కాగా.. కొన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులతో చంద్రబాబు బుధవారం తన నివాసంలో సమావేశమయ్యారు. వారి నియోజకవర్గాల్లో కొన్ని సమస్యలను ప్రస్తావించి పరిష్కరించుకోవాలని సూచించినట్టు సమాచారం. ఆయన్ను కలిసిన వారిలో మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు, గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ఢిల్లీ వెళ్లే ముందు ఆయన అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, కళావెంకట్రావు తదితరులతో చర్చించారు. బీజేపీ పెద్దలతో జరిపే చర్చలకు సంబంధించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో కలపాలి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రికి ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ వినతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాల్సిందిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేశ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన రవాణాశాఖ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆప్కాస్ ఏర్పాటుచేసిన తర్వాత ఆర్టీసీలో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులను అందులోకి బదిలీ చేస్తారని భావించగా.. అలా జరగలేదని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులంతా తమను ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాల్సిందిగా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆర్టీసీని బతికించేందుకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా పని చేశారని, వారికష్టాన్ని గుర్తించి ఆప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సంస్థలో ప్రస్తుతం డ్రైవర్ల అవసరం తీవ్రంగా ఉన్నదని చెప్పారు. డ్రైవర్ల కొరత కారణంగా బయటి వారిని తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. తక్షణం నాలుగు వేలమంది డ్రైవర్ల పోస్టులను భర్తీచేస్తే సమస్య నుంచి బయటపడతామని తెలిపారు. మైలేజీ దాటిపోయిన బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు అనుమతులు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు.

పతనం దిశగా సుబాబుల్!

- రోజురోజుకూ పడిపోతున్న ధరలు
- కొనుగోళ్లకు జంకుతున్న వ్యాపారులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు



కంచికచర్ల, ఫిబ్రవరి 7 : సుబాబుల్ కర్ర మార్కెట్ పతనమవుతోంది. ధర క్రమేణా దిగజారుతోంది. పక్షం రోజుల్లోనే టన్నుకు రూ. వెయ్యికి పైగా ధర పడిపోయింది. నామమాత్రంగా తప్పితే గతంలో మాదిరిగా కంపెనీలు కర్ర తీసుకోవటం లేదు. పేపరు కంపెనీలు మార్కెట్లో సంక్షోభం సృష్టించినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదని రైతులు మండిపడుతున్నారు. జనవరి మూడో వారం వరకు పేపరు కంపెనీలు సుబాబుల్ కర్రను చురుకుగా కొన్నాయి. ఆథరైజ్డ్ యార్డుల ద్వారా అమ్మిన రైతులకు నిరకంగా టన్నుకు రూ. 5,300 వంతున అందాయి. ఆర్సీలపై కొనే వ్యాపారులు టన్నుకు రూ. ఐదువేల వరకు ఇచ్చారు. నాలుగో వారంలో ధర రూ. ఐదువందలు తగ్గింది. యార్డుల ద్వారా రూ. 4,800 అందగా, వ్యాపారులు రూ. 4,500 వంతున ఇచ్చారు. పక్షం రోజులు కూడా గడవక ముందే మరోసారి ధర తగ్గింది. రెండు రోజుల నుంచి యార్డుల ద్వారా అమ్మిన రైతులకు రూ. 4,500 అందుతుండగా, వ్యాపారులు మాత్రం రూ. నాలుగు వేలకు మించి ఇవ్వటం లేదు. అయితే ఈ ధరకు చురుకుగా కొనుగోళ్లు జరగటం లేదు. ఈ నెల ఒకటి నుంచి ఏపీపీఎం (రాజమండ్రి) కొనుగోళ్లను సగానికి సగం తగ్గించింది. మిల్లులో యంత్రాలు, ఇతర విడిపరికరాలను ఆయిలింగ్, సర్వీసు చేస్తున్నందున ఉత్పత్తి తగ్గటంతో గతంలో మాదిరిగా కర్ర కొనటంలేదని ఆథరైజ్డ్ యార్డుల ప్రతినిధులు చెపుతున్నారు. ఐటీసీ (భద్రాచలం) కూడా కొద్ది రోజులు కర్ర కొనుగోళ్లను నిలిపివేసిందని అంటున్నారు. దీనికితోడు నాణ్యత పేరుతో సన్న కర్ర తీసుకోవటం లేదు. తోటల్లోనే సన్న కర్రను పక్కన పడేస్తున్నారు. పది టన్నులకు రెండు టన్నుల వంతున సన్న కర్ర వస్తున్నదని చెపుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఆర్సీలపై కర్ర కొనుగోలు ఎక్కువగా జరుగుతుంది. ఈ రెండు కంపెనీలు కూడా ఆర్సీలు కల్గిన వ్యాపారుల నుంచి కర్ర తీసుకోవటం లేదు. కర్ర కోసం దుకు వ్యాపారులు జంకుతు దాదాపుగా కొనుగోళ్లను నిలిపివేశారు. దీనికితోడు పలువురు వ్యాపారులు టన్ను ఐదు వేల వంతున ముందుగా రైతులకు అడ్వాన్సులు ఇచ్చారు. కొంతమంది చేలల్లో కర్ర నరుకుతుండగా, ఇంకొంత మంది నరుకుడు మొదలు పెట్టలేదు. ఈ నేపథ్యంలో ధర దారుణంగా పడిపోవటంతో వ్యాపారులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు. లక్షల్లో నష్టపోవాల్సి రావటంతో లబోదిబోమంటున్నారు. కాగా ఒకవైపు నాయకులు, మరోవైపు అధికారులు ఎన్నికల వాతావరణంలో నిమగ్నమై ఉన్నారు. ఈ తరుణంలో పేపరు కంపెనీలు ధర తగ్గించాయి. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించినప్పటికీ పాలకులు లేదా అధికారుల్లో ఏమాత్రం స్పందన లేదు. మార్కెట్లో కావాలని సంక్షోభం సృష్టిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోక పోవటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వాసం పొందేందుకు

అడ్డదారులు!

- గాంధీ బ్యాంకు డైరెక్టర్లకు బెదిరింపులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చూసేందుకు కొందరు పెద్దలు అడ్డదారులు తొక్కుతున్నారని డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఫిబ్రవరి 12న అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. మొత్తం 12 మంది సభ్యుల్లో ఏడుగురు అవిశ్వాస తీర్మానంపై సంతకం చేశారు. మరో సభ్యుడి మద్దతు లభిస్తే చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గుతుంది. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన కొందరు పెద్దమనుషులు ఇరుపక్షాల నడుమ రాజీ చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన డైరెక్టర్లకు బెదిరింపులు మొదలయ్యాయి. చైర్మన్ మనుషులమంటూ కొందరు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగుతున్నారని డైరెక్టర్లు కె.నాగేశ్వరరావు, టి.సుబ్బారావు ఆరోపించారు. చైర్మన్ తీరు తొలి నుంచీ వివాదాస్పదంగానే ఉంటోందని, అడ్డదారిలో చైర్మన్ పదవిలో కూర్చుని, దాన్ని కాపాడుకునేందుకు బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుత చైర్మన్ బాబాయి చిట్టియ్య చైర్మన్‌గా తన తర్వాత కోగంటి వెంకటరామయ్యను పదవిలో కూర్చోబెట్టాలని భావించారని, కానీ బాబాయిను తప్పుదారి పట్టించి ఈయన చైర్మన్ పదవి దక్కించుకున్నారని వారు విమర్శించారు. బ్యాంకుతో సంబంధం లేని రిటైర్డ్ సహకార ఉద్యోగులు బ్యాంకు కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని చైర్మన్ అక్రమాలకు సహకరిస్తున్నారని వీటికి చెక్ పెట్టేందుకే తాము అవిశ్వాసం ప్రతిపాదించామన్నారు.

గతంలో బ్యాంకు సర్వసభ్య సమావేశంలో సభ్యుడు ఒకరు తనను ప్రశ్నించారని ఏకంగా మైకును అతనిపైకి విసిరారని, చైర్మన్‌పై క్రిమినల్ కేసులు కూడా న్యాయస్థానాల్లో నడుస్తున్నాయని అలాంటి వ్యక్తి చైర్మన్ పదవిలో ఉండటానికి అనర్హుడని వారు వ్యాఖ్యానించారు.



ప్రసంగిస్తున్న సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

బీజేపీ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ఓడిద్దాం

- 16న దేశవ్యాప్త నిరసనలో పాల్గొనండి
- మెడికల్ రిప్స్‌కు సీఐటీయూ నేతల పిలుపు
- ప్రారంభమైన మెడికల్ రిప్స్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

కృష్ణలంక, ఫిబ్రవరి 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఓడించాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గవర్నరుపేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనియన్ జాతీయ అధ్యక్షులు రమేష్ సుందర్ పతాకావిష్కరణ చేశారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ పూర్ణానంద్ ఆహ్వానసంఘం తరఫున సమావేశాలకు స్వాగతం పలికారు. సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కరుమల యన్ సమావేశాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్‌కోడ్‌లు తెచ్చిందని తెలిపారు. ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు అప్పజెబుతున్నదని వివరించారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారికి ఇబ్బందులు పెడుతున్నదని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. ఉపాధి కోల్పోయి నిరుద్యోగం పెరిగిందన్నారు. కార్పొరేట్లకు మాత్రం మోదీ ప్రభుత్వం అన్నివిధాలా మేలు చేస్తోందని చెప్పారు. దేశ ప్రజల సమస్యలు పక్కతోవ పట్టించడానికి మతాన్ని వినియోగిస్తున్నదని తెలిపారు. ఈ వాస్తవాన్ని గమనించి ప్రజానుకూల విధానాల కోసం పోరాడాలని చెప్పారు. ఫార్మా యాజమాన్యాలు ప్రజారోగ్యంపై లాభాలు సంపాదిస్తున్నాయని, కానీ మెడికల్ రిప్స్ సమస్యలు పట్టించుకోవడం లేదని చెప్పారు. ప్రభుత్వ విధానాలు కూడా దీనికి కారణమన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌ను పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని మెడికల్ రిప్స్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ అఖిల భారత నాయకులు జెఎస్ మజుందార్, శంతన్‌కుమార్, ఏవీ నాగేశ్వరరావు, కృష్ణయ్య, ఆర్.అజయ్‌కుమార్, జి.కిషోర్‌కుమార్, వెంకటేశన్, ఎల్.రాజు, మాధవరావు, ఎం.వి.సుధాకర్, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.కమల, ఎంసిహెచ్ సుప్రజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌జిల్లా డీఈవోగా యూవీ సుబ్బారావు



విజయవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా యూవీ సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. సుబ్బారావు 1989లో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది శ్రీకాకుళంలో ఏపీ మోడల్ స్కూల్స్‌కు వెళ్లారు. అనంతరం ఎస్పీడీ కార్యాలయంలో ఏవోగా పనిచేశారు. 2020లో మచిలీపట్నం ఉపవిద్యాశాఖాధికారిగా వ్యవహరించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బదిలీపై వచ్చారు.

మెగా డీఎస్సీ ఇవ్వకుంటే..

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

- ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక

గవర్నరుపేట, ఫిబ్రవరి 7 : 23 వేల టీచర్ పోస్టులు ఇవ్వకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ నేతలు హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో మెగా డీఎస్సీని విడుదల చేయాలని బుధవారం వినూత్నంగా అర్ధనగ్న ప్రదర్శన జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి అధికారంలోకి రాకముందు ప్రజా సంకల్ప యాత్రలో 50 వేల పోస్టులకు మెగా డీఎస్సీని విడుదల చేస్తానని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు.

పేర్ని నానికి ప్రజలే బుద్ధి చెబుతారు: జనసేన

కంకిపాడు, ఫిబ్రవరి 7 : మచిలీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేర్ని నానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జనసేన పెనమలూరు సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిపై నాని చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో బాలశౌరి చేసిన అభివృద్ధి మినహా, పేర్ని నాని మంత్రిగా, ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి వివరించాలన్నారు. బాలశౌరిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సుంకర శివ, బోయిన నాగరాజు, అడపా నాగశ్రీ, సుంకర సురేష్, కుంట గంగాధర్, పచ్చిపాల శేఖర్, వాక ఓంకార్, పిచుక క్రాంతి పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి పూజలు

పెనమలూరు, ఫిబ్రవరి 7 : యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామికి బుధవారం త్రయోదశి సందర్భంగా ప్రదోషకాలంలో మహానందీశ్వస్వామికి అభిషేకం, అర్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు సాగర్ భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలం దించగా ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ గంగాధర్ పర్యవేక్షించారు.

టీడీపీ నేత పల్లగానికి మాతృవియోగం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 7: టీడీపీ గ్రామ కమిటీ కార్యదర్శి పల్లగాని వెంకట నాగేశ్వర రావు తల్లి సీతారావమ్మ(91) వృద్ధాప్యకారణాలతో బుధవారం మృతి చెందారు. సింగన్నగూడెంలో పల్లగాని సీతారావమ్మ, సూర్యనారాయణ కుటుంబ సభ్యులు టీడీపీ ఆవిర్భావం నుంచి సేవలందిం చడంతో పాటు 16 సంవత్సరాలు పంచాయితీ పాలకవర్గ సభ్యురాలిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. సీతారావమ్మకు భర్త సూర్యనారాయణ, ఏడుగురు కుమారులు, వారిలో ఒక కుమారుడు నాగేశ్వరరావు టీడీపీ కార్యదర్శిగా సేవలందిస్తుండగా, మనుమడు పల్లగాని వీరాంజనేయులు పంచాయతీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. సీతారావమ్మ భౌతికకాయానికి టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, పుట్టా సురేష్, పుసులూరి లక్ష్మీనారాయణ, బెజవాడ వెంకట కృష్ణారావు, మొవ్వా వేణుగోపాల్, కసుకుర్తి అర్జునరావు, మరీదు తిరుపతిరావు, తొమ్మండ్రు ఆనంద్‌బాబు తదితరులు నివాళులర్పించారు.





మెట్లపల్లిలో యార్లగడ్డ వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు.. ఉయ్యూరులో బోడె ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

గన్నవరం, ఫిబ్రవరి 7: రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వామేనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రాజధాని ఎక్కడో చెప్పలేని దుస్థితిలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే నాయకుడు చంద్రబాబు అన్నారు. మండ లంలోని మెట్లపల్లి, కొత్తగూడెం, చిక్కవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ అధికారంలోకి రాగానే రాజధాని అమరావతిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, బోడపాటి రవి కుమార్, జూపల్లి సురేష్, మండవ అన్వేష్, పరుచూరి నరేష్, జొన్నలగడ్డ సుధాకర్, కోటేశ్వరరావు, సత్యనా రాయణ, పోతురాజు, శోభనాద్రి, శ్రీను, పడమట రాంబాబు, అనీల్, ఖాలీషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ

టీడీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి

ఉయ్యూరు : వెనుక బడిన తరగతులు, ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని పార్టీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ అన్నారు. బాబూ ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం 17, 18 వార్డుల్లో టీడీపీ, జనసేన నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు రాజులపాటి ఫణి, నజీర్, జంపాన పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పార్టీ నాయకులు ఖుద్దూస్, గుర్నాధరావు, సంగెపు రంగా రావు, జంపాన శ్రీనివాసరావు, బొర్రా సుబ్బారావు, వెంకటేశ్వరరావు, ఆరేపల్లి సుబ్బారావు, సగీర్, చలపాటి శ్రీను, అంజిబాబు, చిరంజీవి, జనసేన నాయకులు చినకోటయ్య, మహాలక్ష్మి, శివప్రసాద్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై విసుగెత్తిపోయారు

పెనమలూరు : వైసీపీ పాలన పట్ల విసుగెత్తిన ప్రజలు చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు మొక్కపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం యనమలకుదురు 53, 55బూత్‌ల పరిధిలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అన్ని రంగాలను సర్వనాశనం చేసిన సైకో జగన్ మనస్తత్వాన్ని ప్రజలు అర్థం చేసుకొన్నారని పేర్కొన్నారు. వారి వెంట కొండ, బిచాలి, సయ్యద్ షాహీనా తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు దారుణం



నోటీసులు అందుకుంటున్న ఆశాలు

పెనమలూరు, ఫిబ్రవరి 7 : ఆశావర్కర్లకు, సీఐటీయూ నాయకులకు పోలీసులు అర్ధరాత్రి నోటీసులిచ్చి, హౌస్ అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు తీవ్రంగా ఖండించారు. ఎనిమిదో తేదీన ఆశా వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమానికి సమాయత్తమవుతుంటే ఆరవ తారీఖు నుంచే వారిని గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనంగా అభివర్ణించారు

సమస్యలు పరిష్కరించాలని

ఏఆర్ కాలనీ వాసుల ఆందోళన



తమ కాలనీ వాసుల వివరాలు సచివాలయంలో లేకపోవడంపై సిబ్బందిని నిలదీస్తున్న ఏఆర్ నగర్ కాలనీ వాసులు

పెనమలూరు, ఫిబ్రవరి 7 : తమ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంపై గంగూరు పంచాయతీ ఏఆర్ నగర్ కాలనీ వాసులు మంగళవారం రాత్రి నుంచి ఆందోళన చేపట్టి బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, తమ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఊదరగొట్టగా నమ్మి గుంపగుత్తగా ఓట్లేశామని, గెలిచిన ప్రజా ప్రతినిధులు తమ కాలనీలో సౌకర్యాలు కల్పించకపోగా ఎప్పటి నుంచో ఉన్న పంచాయతీ కార్యాలయాన్ని వేరే చోటకు తరలించారని, ఏభై ఏళ్ల కిందట నిర్మించిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలో షుమారు ఏభై మంది చిన్న పిల్లలు ఉండగా ఇక్కడ ఇంత వరకు అంగన్‌వాడీ భవనం నిర్మించలేదని, గతంలో కాలనీలోని చర్చి ఆవరణలో తాత్కాలికంగా నడిచిన ప్రాథమిక పాఠశాలను మరో చోటికి తరలించడంతో దూర ప్రాంతాలకు పిల్లలు వేళాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో ఉన్న సచివాలయంలో తమ వివరాలు లేవని, కాలనీకి చెందిన 50మందికి మాత్రమే వణుకూరులో ఇళ్లస్థలాలు ఇచ్చారని, అర్హులైన వందమందికి పైగా ఇవ్వాల్సి ఉండగా పట్టించుకోవడం లేదన్నారు. తాము ఇంత ఆందోళన చేస్తున్నా, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించికపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గన్నవరం, ఫిబ్రవరి 7 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్తాబాద నవ భారత్ హైస్కూల్‌లో బాలమేళా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నవభారత్ హైస్కూల్ ప్రిన్సిపాల్ షేక్ ఇమాం మాట్లాడుతూ, ఆటల పోటీలతో బాల బాలికలు శారీరక ధృఢత్వం కలిగి ఉంటారన్నారు. కరస్పాండెంట్ షేక్ జకీరా సుల్తానా, కో-ఆర్డినేటర్ ప్రభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల బరితెగింపు!

- రహదారి మధ్యలో వైఎస్‌ఆర్ విగ్రహం ఏర్పాటుకు పనులు
- పట్టించుకోని అధికారులు



రహదారి మధ్యలో విగ్రహం ఏర్పాటుకు సాగుతున్న పనులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 7 : వేలేరు, రేమల్లె వెళ్లే ప్రధాన రహదారిపై ఆర్వోబీ వద్ద కూడలిలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు కనీస అను మతులు కూడా లేకుండా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అసలే గుంటలతో నిండిన రహదారి బాగు చేయకపోగా ఉన్న రహదారికి అడ్డుగా మధ్యలో మూడు అడుగుల వెడల్పుతో భారీ గొయ్యి తవ్వడంతో పాటు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఇనుప మెష్‌ను బిగించేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వైసీ పీ నాయకులు దగ్గరుండి మరీ పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు గోతులతో నిండి ఉన్నా మరమ్మ తులు కూడా చేయడం చేతగాని నాయకులు విగ్రహం కోసం బాగున్న రహదారిని తవ్వేయడంపై స్థానిక ప్రజలతో పాటు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఆర్ అండ్ బీ, పంచాయతీ, రెవెన్యూ అధికారులుగానీ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్డును ధ్వంసం చేస్తూ, రాకపోకలకు ఇబ్బంది కలిగేలా ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి



నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కోన శ్రీనివాస్

ఉయ్యూరు, ఫిబ్రవరి 7 : ఆర్య వైశ్యులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు సంఘటితం కావాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాస్ అన్నారు. స్థానిక తేజ డిజిటల్ తృతీయ వార్షికోత్సవ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య మహాసభ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల సాంబశివరావు, మహాసభ కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు, కె రఘు, సన్నిధి నాగసాయి, ప్రసాద్‌రాజు, కుటుంబరాజు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పారదర్శకత పాటించాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ సూర్యనారాయణ ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.13.44 కోట్లు వ్యయంతో నిర్వహించిన 1762 పనులపై గత నెల 25 నుంచి 6వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీలు లక్ష్మీరెడ్డి, నాంచారయ్య, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ సురేష్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రత్నకుమారి, ఏపీవో పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలి

జిల్లా వైద్యాధికారి గీతాబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

కాటూరు(ఉయ్యూరు), ఫిబ్రవరి 7 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని డీఎంహెచ్‌వో గీతాబాయి సూచించారు. కాటూరు పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులు, పిల్లల నమోదు పక్కాగా చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రం అధికారి శివరామకృష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి నాగార్జున వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై దాడులు

కంకిపాడు, ఫిబ్రవరి 7 : వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని టీడీపీ మండల అధ్యక్షుడు సుది మళ్ల రవీంద్ర అన్నారు. కంకిపాడులో ఈ నెల 11న నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి దళిత గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొండా ప్రవీణ్, దొప్పలపూడి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజా గురవయ్య, వణుకూరు విక్రం, మనం బాజి, మామిళ్ల నాగరాజు, దార్ల బాబు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

పెనమలూరు, ఫిబ్రవరి 7 : తాడిగడవపలోని ఒక ప్రైవేట్ ఇంటర్ కళాశాలలో లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకొంటున్న విద్యార్థినీని ప్రేమ, పెళ్లి పేరుతో వేధిస్తున్న ప్రకాశం జిల్లా యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా రాచర్లకు చెందిన విద్యార్థిని తాడిగడప వద్ద ఉన్న ఇక ప్రైవేట్ కళాశాలలో కోచింగ్ తీసుకొటోంది. అదే గ్రామానికి చెందిన మాదరి హనూక్‌రాజ్ అనే యువకుడు కళాశాల రిసెప్షనిస్టు వద్దకు వచ్చి బాలికకు అసభ్యకరమైన ఫోటోలు చూపించి తనను పెళ్లి చేసుకోమని, బెదిరించగా ఆమె కేకలు పెట్టింది. దీంతో కళాశాల సిబ్బంది అప్రమత్తమై అతడిని పట్టుకొనే ప్రయత్నం చేయగా పారిపోయాడు. దీంతో బాలిక బుధవారం తల్లిదండ్రులతో కలిసి వెళ్లి రాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, పెనమలూరు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు యువకుడి కోసం గాలిస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

హనుమాన్ జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 7 : నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుతో కూడిన సమున్నత లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ రాజాబాబు విద్యార్థులకు సూచించారు. వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ 35వ వార్షికోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అతిథులకు ఎన్‌సీసీ క్యాడెట్ల మార్చ్‌పాస్ట్‌తో, విద్యార్థులు పూర్ణకలశంతో అపూర్వస్వాగతం పలికారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా విద్య నభ్యసించాలని డీఈ వో తాహెరా సుల్తానా సూచించారు.

కమ్యూనిస్టులకు

జాస్తి దంపతులు స్ఫూర్తి

పెనమలూరు, ఫిబ్రవరి 7 : జీవిత చరమాంకం వరకు ఎర్ర జెండా పట్టి పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాటుపడి అమరులైన జాస్తి దంపతులు కమ్యూనిస్టులకు స్ఫూర్తి అని సీపీఐ నేత అక్కినేని వనజ అన్నారు. ఇటీవల మృతి చెందిన జాస్తి సక్కుబాయి సంస్మరణ సభ బుధవారం స్థానిక వసంత్‌నగర్ కాలనీలోని సామాజిక భవనంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు దోనేపూడి శంకర్, పెన్మత్స దుర్గాభవాని, తాతయ్య, నార్ల వెంకటేశ్వరరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, వెలగపూడి ఆజాద్, ఆర్ పిచ్చయ్య, అనుమోలు ప్రభాకరరావు, మన్నవ కృష్ణచైతన్య, తోటకూర రమ్యకృష్ణ, కంచర్ల సూర్య చంద్రరావు, సౌజన్య, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు యార్లగడ్డ పరామర్శ

గన్నవరం, ఫిబ్రవరి 7: వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడ్డ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగబాబును టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు బుధవారం పరామర్శించారు. అలాగే పార్టీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌ను కూడా పరామర్శించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.46



13 నుంచి బ్రహ్మోత్సవాలు

మోపిదేవి, ఫిబ్రవరి 7: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 13 నుంచి నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని భక్తులను ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు కోరారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న ఉదయం 11గంటలకు స్వామిని పెండ్లికుమారుడిని చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 14న స్వామి కల్యాణమహోత్సవం, 15న రథోత్సవం, 16న వసంతోత్సవం, సుబ్రహ్మణ్యమాలదీక్షావిరమణ, మయూరవాహనంపై బ్రహ్మోత్సవం, 17న సుబ్రహ్మణ్యహవనం, స్వామి పవళింపుసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

నందివాడ ఎస్సైగా

చంటిబాబు



నందివాడ, ఫిబ్రవరి 7: నందివాడ ఎస్సైగా ఎన్. చంటిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఆయన తెలిపారు.

మినుము పైరుకు మందు కొడుతుండగా

కూలీకి పాముకాటు

• ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కోడూరు, ఫిబ్రవరి 7: మినుము పైరుకు మందు పిచికారీ చేస్తుండగా పాముకాటేయడంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మాచవరం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన అప్పికట్ల రఘురాం(39) అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. అక్కడ పాము కాటేసింది. వెంటనే స్థానికులు అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడని, ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

అంబటి, పేర్నికి బాలశౌరిని విమర్శించే అర్హత ఉందా?

• జనసేన మండల నేతల ప్రశ్న

మోపిదేవి, ఫిబ్రవరి 7: ఇరిగేషన్ శాఖ, ఇతర సమస్యలపై కనీస అవగాహన లేని మంత్రి అంబటి రాంబాబు, మచిలీపట్నం అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులైనా తీసుకురాలేని ఎమ్మెల్యే పేర్ని నానికి అభివృద్ధి పనులు చేసే ఎంపీ బాలశౌరిని విమర్శించే అర్హత ఉందా? అని జనసేన పార్టీ మండల నాయకులు ప్రశ్నించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పూషడపు రత్నగోపాల్, మాదివాడ వెంకటకృష్ణ, కోసూరు శివాజీ, మెరకనపల్లి నరేష్, మత్తి వంశీ పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణుల సంబరాలు

పెడన: టీడీపీ పెడన టికెట్ కాగిత కృష్ణప్రసాద్‌కు కేటాయించారంటూ టీడీపీ శ్రేణులు బుధవారం పట్టణంలో హడావుడి చేశారు. బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వమిది

• టీడీపీ 'గుడివాడ' ఇన్‌చార్జి వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 7: వైసీపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను పట్టించుకోకుండా గాలికొదిలేసిందని, పైనా అధికార పార్టీ నేతలు నీతి కబుర్లు చెబుతున్నారని టీడీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం వలివర్తిపాడులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులు పూలమాలతో ఘనంగా వారి స్వాగతం పలికారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, పన్నుల రూపంలో ప్రభుత్వం దోచుకుందని వెనిగండ్ల విమర్శించారు. టీడీపీకి వలివర్తిపాడు కంచుకోట అని, పార్టీ జెండా నియోజకవర్గంలో ఎగిరేందుకు కార్యకర్తలు కష్టించి పనిచేయాలని రావి పిలుపునిచ్చారు. జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), వాసే మురళీ, శాయిన పుష్పవతి, డాక్టర్ గొర్జి సూర్యనారాయణ, రేమల్లె రజనీకాంత్, సమ్మెట అశోక్, దొండపాటి మహేష్, తోకల క్రాంతి పాల్గొన్నారు.



వెనిగండ్ల, రావికి ఘనస్వాగతం పలుకుతున్న వలివర్తిపాడు టీడీపీ శ్రేణులు

శ్రీనగర్‌లో..

చల్లపల్లి: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన పొత్తును ఆశీర్వదించాలని ప్రజలను టీడీపీ మండల నేతలు కోరారు. పాగోలు శివారు శ్రీనగర్‌లో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని ఆరు హామీలను ప్రజలకు వివరించారు. మోర్ల శివ, పఠాన్ జిలానీ, వీర్ల మధు, మేకా వెంకటేశ్వరరావు, షేక్ నబీ షేరి, మేడికొండ రవిబాబు, వేములపల్లి పసిబాబు, కొలుసు సుబ్బారావు, డొక్కు గంగాభవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను భ్రష్టు పట్టించిన ఘనుడు జగన్: కుమార్‌రాజా

పామర్రు: అభివృద్ధి చేయకుండా గ్రామాలను భ్రష్టుపట్టించిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీడీపీ పామర్రు నియోజవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా విమర్శించారు. పల్లెప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కుమార్‌రాజా చేపట్టిన పల్లెబాట పాదయాత్ర బుధవారం కురుమద్దాలి నుంచి మూడో రోజు ప్రారంభమైంది. బల్లిపర్రు, పెదమద్దాలి మీదుగా పామర్రులోని చాట్లవానిపురం వరకు సాగింది. ఆ గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగింది. గ్రామాల్లో అన్నివర్గాల ప్రజలు పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. నాలుగేళ్లన్నర నుంచి తమ గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని కుమార్‌రాజా దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్ నిర్వాకంతో స్థానిక సంస్థలు భ్రష్టుపట్టిపోయాయన్నారు. గ్రామాలాభివృద్ధికి 14, 15వ ఆర్థిక సంఘం పంచాయతీలకు విడుదల చేసిన వేలాది కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం మింగేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నేత వీరంకి వెంకట గురుమూర్తి, గొట్టిపాటి లక్ష్మీదాస్, వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కొసరాజు వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ సుధాకర్, సంజీవరావు, కెప్రభాకర్, చాట్ల అర్జున్ పాల్గొన్నారు.



బల్లిపర్రులో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తున్న వర్ల కుమార్‌రాజా

నిధుల మళ్లింపుపై..

అధికార పార్టీ సర్పంచ్‌లూ ఆగ్రహంగా ఉన్నారు

• తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను దారి మళ్లించడంతో ప్రతిపక్ష సర్పంచ్‌లతో పాటు అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు కూడా ఆగ్రహంగా ఉన్నారని, సీఎంపై తిరుగుబాటు చేస్తున్నారని తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా ఈ ప్రభుత్వం మార్చిందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీల హక్కులను ప్రభుత్వం కాలరాసిందని, స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉభయ సభల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు ఐదేళ్లలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. నియంతృత్వ పోకడలతో వెళుతున్న సీఎం జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సర్పంచ్‌ల పోరాటానికి టీడీపీ మద్దతు ఉంటుందని తెలిపారు. పి.వి. ఫణికుమార్, గంజాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పోరాటం మరింత ఉధృతం చేస్తాం

మచిలీపట్నం టౌన్: సర్పంచ్‌ల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు, పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు నిర్వహించిన సర్పంచ్‌ల ఉద్యమాన్ని అరెస్టులతో ఉక్కుపాదం మోపుదామని ప్రభుత్వం చూసినా ఉద్యమం విజయవంతమైందన్నారు. అసెంబ్లీగేటు ముందు, మందడం గ్రామ సెంటర్, విజయవాడ ఆర్టీసీ బస్టాండ్, ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ నివాసం వద్ద సర్పంచ్‌లు నిరసన తెలిపారన్నారు. ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు.

సేవాతత్పరుడు

వెనిగండ్ల రాము

గుడివాడ: కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్న వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని వెనిగండ్ల రాము స్వగృహంలో గుడ్లవల్లేరు మండలం చిన్నగొన్నూరు గ్రామానికి చెందిన కోటప్రోలు శ్రీనివాసరావుకు ట్రైసైకిల్‌ను రాము, బూరగడ్డ అందించారు. శాయన పుష్పావతి, సాంబయ్య, కాకరాల సురేష్, శాయన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





పంచాయతీ కుళాయిల్లో..

నీరు దుర్వాసన వస్తోంది

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 7: పంచాయతీ కుళాయిల్లో నీరు దుర్వాసన వస్తోందని, ఆకుపచ్చగా ఉన్న నీటిని విడుదల చేస్తున్నారని కౌతవరం గ్రామస్థులు ఈడే కృష్ణారావు, మరికొందరు బుధవారం ఆందోళనకు దిగారు. బుధవారం గ్రామంలోని రక్షిత తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్లను వారు పరిశీలించారు. ఫిల్టర్ చేయకుండానే నీటిని విడుదల చేస్తున్నారని వారు ఆరోపించారు. కార్యదర్శితో మాట్లాడదామని పంచాయతీ కార్యాలయానికి వెళితే ఆయన అందుబాటులో లేరని కృష్ణారావు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.



కౌతవరంలో నీటిని చూపుతూ ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చల్లపల్లి అభివృద్ధికి సహకరించండి

• ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర మిషన్ ఎండీ గంధం చంద్రుడుతో స్వచ్ఛ చల్లపల్లి బృందం

చల్లపల్లి, ఫిబ్రవరి 7: చల్లపల్లి గ్రామాభివృద్ధికి సహకరించాలని పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడును సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు కోరారు. బుధవారం మంగళగిరిలోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు వెళ్లిన స్వచ్ఛ బృందం స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమ వివరాలను వారికి వివరించారు. గ్రామంలో రోజువారీ చెత్తసేకరణ, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీని వివరించారు. మూడు వేల రోజులకు పైగా జరుగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని వివరించారు. గ్రామాభివృద్ధికి సానుకూలంగా స్పందించారని, చెత్త సేకరణకు ట్రాక్టర్ మంజూరు చేస్తున్నామని, డ్రెయిన్ మిషన్ ట్రై సైకిల్స్ ఇస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు.



రాజశేఖర్, చంద్రుడుకు చేతిసంచులు అందిస్తున్న సర్పంచ్, స్వచ్ఛ చల్లపల్లి సారథులు

బదిలీ అయిన తహసీల్దార్ లతీఫ్‌పాషాపై చర్యలు తీసుకోవాలి

• టీడీపీ మండల అధ్యక్షుడు బండే డిమాండ్

కోడూరు, ఫిబ్రవరి 7: మండలంలో నివేశనా స్థలాల పంపిణీలో అవినీతికి పాల్పడిన పూర్వ తహసీల్దార్ ఎస్కే. లతీఫ్ పాషాపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం బదిలీపై వెళ్లిన లతీఫ్‌పాషా ఇక్కడి నుంచి వెళ్లిపోయే ఆఖరి రోజు ప్రభుత్వ లేఅవుట్‌లో 40 ప్లాట్లు వైసీపీ సానుభూతిపరులకు, అనర్హులకు అమ్ముకున్నారని ఆరోపించారు. దింటిమెరకలో అర్హులైన వారు కాలువ గట్లపై నివశిస్తున్నా వారికి స్థలాలు మంజూరు చేయలేదన్నారు. కలెక్టర్, ఆర్డీవో స్పందించి విచారణ చేసి, తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కృత్రిమ మేధతో నూతన ఔషధాల రూపకల్పన

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 7: నిషేధించిన ఔషధాల నుంచి నూతన ఔషధాలను రూపొందించడంలో కృత్రిమ మేధస్సు ఎంతో ఉపయోగపడుతుందని దక్షిణ కొరియాకు చెందిన సూజింగ్ విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశ్రుత తెలిపారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ సహకారంతో నరాల క్షీణత రుగ్మతలకు అందించే చికిత్సా పద్ధతుల్లో కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణలో జిన్సెంగ్ ప్రభావం అనే అంశాలపై వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. మెదడుపై దుష్ప్రభావాలు చూపే ఎన్నో వ్యాధులు ఈ కాలంలో ప్రబలుతున్నాయని వాటికి నూతన ఔషధాలను రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్య అతిథి సుశ్రుత వివరించారు. జిన్సెంగ్ వేరు ఔషధ గుణాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్పందన రాజేంద్ర వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఎస్కే. అమీనాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ బి.మోహన్‌గాంధీ, డాక్టర్ టి.బాలకృష్ణ పాల్గొన్నారు.

కరాటేలో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ: బాపట్లలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 4న నిర్వహించిన అంతర్రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి ప్రథమ బహుమతిని సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో 13 ఏళ్ల లోపు బాలుర 50 కేజీల వ్యక్తిగత కుమితే విభాగంలో బి.జశ్వంత్ ప్రథమ, 14 ఏళ్ల లోపు బాలుర 50 కేజీల వ్యక్తిగత కుమితే విభాగంలో జి.భువనేష్ ప్రథమ, 64 కేజీల కుమితే విభాగంలో టి.హేమంత్ ప్రథమ, 9 ఏళ్ల లోపు బాలుర 30 కేజీల వ్యక్తిగత కుమితే విభాగంలో కె.వేదశ్రీ నాగేంద్రకుమార్ ప్రథమ, వ్యక్తిగత కటా విభాగంలో జె.ఆయాన్‌జేన్ ద్వితీయ, సీహెచ్ భవ్య తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీనా అభినందించారు.

నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపం

పెడన రూరల్: నులిపురుగుల వలన పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని డీఎంహెచ్‌వో జి.గీతాభాయి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో హరిబాబుతో కలిసి పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలకు మాత్రలను పంపిణీచేశారు. ఏడాదిన్నర నుంచి పదమూడేళ్ల పిల్లలకు ఆరునెలలకోసారి మాత్రలు అందించాలన్నారు. ఇళ్ల వద్ద పిల్లలను ఏఎన్ఎంలు గుర్తించి వారికి అందేలా చూడాలన్నారు. వైద్యాధికారులు హిమబిందు, పర్వేజ్ హైదర్ బాక్సేరి, ప్రీతి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మోపిదేవి, ఫిబ్రవరి 7: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులను తహసీల్దార్ ఎం.శ్రీవిద్య ఆదేశించారు. బుధవారం మోపిదేవి, మోపిదేవిలంక, నాగాయితిప్ప గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ సిబ్బందితో కలసి ఆమె పరిశీలించారు. .

కూచిపూడి: మొవ్వ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలిచ్చారు. కూచిపూడి, పెదపూడి, బార్లపూడి, మందపాలెం, కోళ్లపాలెం కేంద్రాల్లో వసతులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నందివాడ: తమిరిశ, అనుమనపూడి, రుద్రపాక గ్రామాల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ విజయ్ కుమార్‌రాజ్ పరిశీలించారు. మండలంలో పోలింగ్ బూతుల్లో వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.





తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

• కలెక్టర్ పి.రాజాబాబు

బంటుమిల్లి/కృత్తివెన్ను, ఫిబ్రవరి 7: వేసవి కాలం దృష్ట్యా 80 శాతం చెరువులను నీటితో నింపామని, త్వరలో పూర్తిస్థాయిలో మంచినీటి చెరువులు నింపుతామని, తాగునీరు సరఫరా కాని ప్రాంతాలకు అధికారులతో మాట్లాడి సరఫరా చేయిస్తామని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. బంటుమిల్లి మండలం మల్లేశ్వరంలో మెగా రక్షిత మంచినీటి చెరువును, కృత్తివెన్ను మండలంలో శీతనపల్లి మెగా రక్షిత మంచినీటి పథకం చెరువు, పల్లెపాలెం రక్షిత మంచినీటి చెరువులతో పాటు ప్రధాన పంట కాలువను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వైసీపీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము వివరించారు. అధికారులు పర్యవేక్షణా లోపం కారణంగా అక్రమ కనెక్షన్లతో పాటు ఇష్టానుసారంగా విద్యుత్ మోటర్లు ఏర్పాటుచేయడం వల్ల తాగునీరు అందడం లేదని, ఫిల్టర్‌బెడ్లు పని చేయకపోవడం వల్ల నీరందడంలేదని పలువురు ప్రజాప్రతినిధులు వివరించారు. తాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, సుజ్ఞానం మహేష్, తిరుమాని శ్రీనివాస్, కందుల నాగేశ్వరరావు, మట్టా నాగబాబు, బండారు చంద్రశేఖర్, కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ పాల్గొన్నారు.



మల్లేశ్వరం మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారిక

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కష్టాలు

• సర్వర్లు పనిచేయక పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు

పెదపారుపూడి, ఫిబ్రవరి 7: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ప్రక్రియలో సర్వర్ పని చేయక మండలంలోని లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. 9 గ్రామ సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజి స్ట్రేషన్ ప్రక్రియ మొదలై వారం అవుతున్నా ఇప్పటి వరకు 50 శాతం కూడా రిజిస్ట్రేషన్ అవలేదు. మండలంలో ఇళ్ల స్థలాలు వచ్చినవారు 1876 మంది ఉండగా, బుధవారం నాటికి 590 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు పడాల్సి వస్తోంది. అధికారుల ఒత్తిడి ఎక్కువైందని సర్వర్లు పని చేయకపోతే తామేమి చేస్తామంటూ కిందిస్థాయి ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్లు పనిచేసేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



వెంట్రప్రగడ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కేంద్ర బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు తీరని అన్యాయం

పెడన, ఫిబ్రవరి 7: కేంద్ర బడ్జెట్‌లో చేనేత పరిశ్రమకు తీరని అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కట్టా హేమసుందరరావు, జిల్లా నాయకులు కోదాటి నారాయణరావు, బూసం బాల సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో కేవలం రూ.200 కోట్లు కేటాయించడం శోచనీయమన్నారు. చేనేత పరిశ్రమ నుంచి కోట్లాది రూపాయలను జీఎస్టీ రూపంలో దండుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఆ పరిశ్రమకు బడ్జెట్‌లో రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకొందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను సవరించి చేనేత పరిశ్రమకు కేటాయింపులు పెంచాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్‌బీఐ సెక్యూరిటీ గార్డ్ నిజాయితీ

చల్లపల్లి, ఫిబ్రవరి 7: చల్లపల్లిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసే సెక్యూరిటీ గార్డ్ డేవిడ్ తన నిజాయితీని చూపాడు. రామానగరానికి చెందిన కూరగాయల వ్యాపారి రాఘవయ్య బుధవారం ఉదయం బ్యాంకు ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి ప్రయత్నించగా డబ్బులు రావడం లేదనుకుని వెళ్లిపోయాడు. ఏటీఎం లావాదేవీను పరిశీలిస్తున్న డేవిడ్ ఏటీఎం నుంచీ డబ్బులు రావటంతో అప్రమత్తమై ఏటీఎం నుంచి వచ్చిన రూ.5,500ను తీసుకుని, బ్యాంకు మేనేజర్ భారతి దృష్టికి తీసుకెళ్లాడు. ఖాతాదారుడి వివరాలు తెలుసుకుని అతడిని పిలిపించి ఆ డబ్బును మేనేజర్ అందించారు. సెక్యూరిటీ గార్డ్ డేవిడ్ నిజాయితీని మేనేజర్, ఖాతాదారులు అభినందించారు.



ఖాతాదారుడికి నగదు అందిస్తున్న బ్యాంకు మేనేజర్

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 7: విద్యార్థులు చదువుతో పాటు ఎన్‌సీసీలో ఉంటూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని కేయూ వీసీ జ్ఞానమణి అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొన్న విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థిని టి.లక్ష్మీదమయంతిని వీసీ జ్ఞానమణి, ఎన్‌సీపీ విభాగ అధికారి రామశేఖరరెడ్డి అభినందించారు. రిజిస్ట్రార్ బ్రహ్మచారి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయకుమారి పాల్గొన్నారు.